
“మీ సొంత జీవితాన్ని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోండి: ఇక ఎ ప్పటికీ గట్టెక్కలేనేమో అని మీరు భావించిన పరిస్థితులను మీరు దా టి రాలేదా? గత సంవత్సరం, అం తకు ముందు సంవత్సరం మీరు ఎంతో ఆందోళన చెందారు; అయి నా సరే, ఇప్పుడు మీరిక్కడ ఉ న్నారు, మీలో మీరే పరిపూర్ణంగా ఉ న్నారు.కాబట్టి, బాహ్య సంఘ టనలేవీ మిమ్మల్ని ఏమాత్రం తాక లేవని గ్రహించండి. విశ్వాసం కలిగి ఉండండి; అదే మీకు లభించిన అ త్యంత గొప్ప వరం.”

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ



www.prajadeevena.com

ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 197 | మంగళవారం | 19 మే 2026 | పేజీలు : 04 వెల ₹5



# ప్రధానిగా రాహుల్ మా ప్రధాన కర్తవ్యం

మిత్రులు మళ్లీ కలిసినట్లు ఉంది

ఆ రోజు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తాం

కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవ వాతావరణాన్ని ‘ఎక్స్’లో వర్ణించిన సీఎం రేవంత్

కేరళలో జరిగిన మహత్తరమైన వేడుక వద్దకు తాను చేరుకున్నప్పుడు.. స్నేహితులు, సహచరులను మళ్లీ కలిసినట్లుగా అనిపించిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వేడుకలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్‌విందర్‌సింగ్ సుక్కు, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్, కర్ణాటక, తెలంగాణ ఉప ముఖ్యమంత్రులు శివకుమార్, భట్టి విక్రమార్క తదితరులతో కలిసి ఈ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

## కేరళం ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణం

ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్

హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి



# తెలంగాణ పోలీస్ ప్రతిభ ప్రశంసనీయం

కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం

వారి కృషి అసామాన్యమని మంత్రి అమిత్ షా కితాబు



దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .

**ప్రజా దీవెన, రాయ్‌పూర్ :** తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి, డీజీపీ

మిగతా 2 లో

## పోక్సో కేసులో ట్విస్ట్

అదనపు సెక్షన్స్ చేరిక

మరింత పకడ్బందీగా కేసు విచారణ

02





# భూ ‘మంత్రం’ ధరలకు రెక్కలు

తొర్రూర్ లో చదరపు గజం రూ.45,500

బహదూర్ పల్లిలో చదరపు గజం రూ. 40,500

రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి స్పందన

సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం రాక

02

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నాడు బహిరంగ వేలం నిర్వహించారు.

# నార్వేతో బంధం మరింత బలోపేతం

ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం

ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు

నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన

04

భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.



## చెట్ల నరికివేతను నిలిపివేయాలి

సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు



03

## తక్షణ స్పందనతో ప్రమాదాల నివారణ

ప్రమాదాల సమయంలో ’గోల్డెన్ అవర్’కీలకం

మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# తెలంగాణ పోలీస్ ప్రతిభ ప్రశంసనీయం

మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని



అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.

జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రధానిగా రాహుల్ మా ప్రధాన కర్తవ్యం

**మా లక్ష్యం రాహుల్‌ను ప్రధానిని చేయడమే**

**మిత్రులు మళ్లీ కలిసినట్లు ఉంది**

**ఆ రోజు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తాం**

**కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవ వాతావరణాన్ని 'ఎక్స్'లో వర్ణించిన సీఎం రేవంత్**



**ప్రజా దీవెన, హైదరాబాద్** :కేరళలో జరిగిన మహత్తరమైన వేడుక వద్దకు తాను చేరుకున్నప్పుడు.. స్నేహితులు, సహచరులను మళ్లీ కలిసినట్లుగా అనిపించిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వేడుకలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్‌విందర్‌సింగ్ సుక్కు, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్, కర్ణాటక, తెలంగాణ ఉప ముఖ్యమంత్రులు శివకుమార్, భట్టి విక్రమార్క తదితరులతో కలిసి ఈ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇక్కడి వాతావరణంలో ఆశ, ఉత్సాహం, ఉత్సుకత స్పష్టంగా కనిపించాయని పేర్కొన్నారు. ఇక్కడున్న అందరి ఉమ్మడి లక్ష్యం రాహుల్‌గాంధీని దేశానికి ప్రధాన మంత్రిని చేయడమేనని వెల్లడించారు. ప్రధాన మంత్రిగా రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేసే రోజు కోసం అందరం కలిసి కట్టుగా, ఇదే ఉత్సాహంతో పని చేస్తామని స్పష్టం చేశారు. కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి వాతావరణాన్ని ఎక్స్ వేదికగా ఈ మేరకు వర్ణించారు. ఈ సందర్భంగా సుఖ్‌విందర్‌సింగ్ సుక్కు, భూపేష్ భగేల్, శివకుమార్, భట్టి విక్రమార్క తదితరులతో కలిసి దిగిన ఫొటోలను సీఎం షేర్ చేశారు. కాగా, కేరళం రాజధాని తిరువనంతపురం నుంచి తిరుగు ప్రయాణమైన సీఎం.. రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చేరుకున్నారు.

# కేరళం ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణం

**ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్**

**హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**

**తిరువనంతపురం,మే18 :** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

**అమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం.. రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన**

**ప్రజా దీవెన, హైదరాబాద్ ::** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్ప్ సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# జడ్జి మాధవీదేవిపై తప్పుడు ప్రచారం

**వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి జస్టిస్ టీ.మాధవీదేవిపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన దామోదర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బండి సంజయ్ కొడుకుకు బెయిల్ ఇస్తే తన భర్తకు చైర్మన్ పదవి ఇస్తారని తప్పుడు ప్రచారం చేశాడు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై హైకోర్టు రిజిస్ట్రార్ బి.ఎస్. చిరంజీవి చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు దామెదర్‌ను అరెస్ట్ చేశారు. ఈ దుష్ప్రచారంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.




# చెట్ల నరికివేతను నిలిపివేయాలి

**సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు**

**ప్రజా దీవెన, న్యూఢిల్లీ :** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

# పోక్సో కేసులో ట్విస్ట్

**మరింత పకడ్బందీగా కేసు విచారణ**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయ

# కన్యాశుల్కం తరహాలో వివాహం

**ఎదురు కట్నం ఇచ్చి యువతితో పెళ్లి**

**ఒక్కరోజులోనే జంప్ అయి..ఫిర్యాదు చేసిన యువతి**

**ప్రజా దీవెన, జనగామ :** జనగామ జిల్లా బచ్చన్నపేటలో నాటి కన్యాశుల్కాన్ని తలపించే ఘటన చోటు చేసుకుంది. 18 ఏళ్ల యువతికి 45 ఏళ్ల వ్యక్తితో సవతి తల్లి-తండ్రి వివాహం జరిపించిన ఘటన గ్రామంలో సంచలనం సృష్టించింది. బచ్చన్నపేటకు చెందిన బీఆర్ఎస్ నేత ప్రశాంత్ రెడ్డి ఇటీవల వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యాడు. అదే గ్రామానికి చెందిన దంపతులకు రూ.20 లక్షల అప్పు ఇచ్చాడు ప్రశాంత్ రెడ్డి. అయితే అప్పు తిరిగి ఇవ్వకపోవడంతో వారి కూతురినిచ్చి పెళ్లి చేయాలని ఒత్తిడి చేశాడు. అవసరమైతే ఎదురుకట్నం ఇస్తానని ఆశ చూపి కొంత డబ్బు ముట్టజెప్పాడు. దీంతో సవతి తల్లి- తండ్రి కలిసి తమ 18 ఏళ్ల కుమార్తెను బలవంతంగా ఒప్పించి ప్రశాంత్ రెడ్డితో వివాహం జరిపించారు. అప్పటికే యువతి మరో యువకుడిని ప్రేమించింది. దీంతో పెళ్లైన మరుసటి రోజే ప్రియుడితో యువతి పరారైంది. స్నేహితుల సహాయంతో ప్రశాంత్ రెడ్డి నుంచి తప్పించుకున్న యువతి.. హైదరాబాద్‌లో మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి మహిళా కమిషన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# భూ తగదాలతో అక్కను హత్య చేసిన తమ్ముడు

**సూర్యాపేట, మే 18 :** భూ తగాదాల కారణంగా తమ్ముడు తన అక్కపై కత్తితో దాడిచేసి హత్య చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురిగి సైదులుకు, అతడి సోదరి అంజమ్మకు మధ్య భూమి కోసం గొడవలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి గతంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇరువర్గాలను బైండోవర్ చేసి పోలీసులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆమెను అడ్డు తప్పిస్తే త్వరగా భూమిని సొంతం చేసుకోవచ్చని సైదులు భావించాడు. పనికి వెళ్తున్న అంజమ్మపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భూ 'మంత్రం' ధరలకు రెక్కలు



## తొర్రూర్ లో చదరపు గజం రూ.45,500

## బహదూర్ పల్లిలో చదరపు గజం రూ. 40,500

## రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన

## సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం రాక

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సమీపంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నాడు బహిరంగ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్ పేట లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నబిడ్డర్లు చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం తెలిపారు. తొర్రూల్ లే అవుట్ లో ప్లాట్ ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీలు పడుతూ గరిష్టంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500 (నలభైఐదు వేల అయిదు వందలు)కు వేలం పాటలో కొనుగోలు చేశారని ఎండి శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటి క్యారిడార్ కు సమీపంలో ఉన్న తొర్రూర్ లో 200 -700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు (÷ఙ్గా÷నీబిబ) చదరపు గజానికి కనీస ధర 25 వేల రూపాయలుగా నిర్ధారించగా, సగటున రూ. 32,500 (ముప్పయి రెండు వేల అయిదు వందలు) ధర పలికిందన్నారు. తమకు నచ్చిన భూముల కోసం పోటీ పడుతూ బిడ్డర్లు ఒక దశలో ఎ÷-లాట్ ను దక్కించుకోడానికి దాదాపు ఇరవైసార్లు రేట్లు పెంచారంటే ఇక్కడి భూములకున్న డిమాండ్ అర్థంచేసుకోవచ్చు. అదే విధంగా ఎయిర్ పోర్టు, ఆర్సీఐకి దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ లో 200 నుంచి 400 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ÷-లాట్లకు చదరపు గజం కనీస ధర 20 వేల రూపాయలుగా నిర్ణయించగా, గరిష్టంగా రూ.27,500 ధర పలికింది.అవుటర్ రింగ్ రోడ్ ను ఆనుకుని ఉన్న బహదూర్ పల్లి ప్రాంతంలో 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ÷-లాట్లకు కూడా మంచి ధర పలికింది. ఇక్కడ చదరపు గజం కనీస ధర 27 వేల రూపాయలుగా నిర్ణయించగా, వేలం పాటలో గరిష్టంగా రూ.40,500 (నలభైవేలు ఐదు వందల) రూపాయల ధర పలికింది. వేలం పాటలో సగటున ఈ భూములకు గజం రూ.33,800కు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ బహిరంగ వేలం విక్రయాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

**భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద**

**అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు.

సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ÷ూమప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరి÷- టనెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

# తక్షణ స్పందనతో ప్రమాదాల నివారణ

**తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం**

**మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది



అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ÷ర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

**516 ర్యాంక్ సాధించిన హర్షిణి**

**అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు**

**ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకులు**

**విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సోసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాల్గి÷ అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాల్గి÷ కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాల్గి÷ కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

# నిజామాబాద్‌కు పంగానామాలు

**ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్.. తలెత్తుకోలేక పోతున్న పిసిసి చీఫ్**

**మీడియా సమావేశంలో ఎంపి అర్వింద్ విమర్శలు**

**నిజామాబాద్,మే18 :** నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయని అన్నారు. ఈ హామీలు నెరవేర్చకపోవడంతో పిసిసి చీఫ్ తతెత్తుకోలేక పోతున్నారని అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని



ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

# నగరంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు

**ప్రజా దీవెన, హైదరాబాద్ ::** హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్., హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ శతజయంతి ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రతి రాష్ట్రంలో సాధారణంగా ఒక్క గిరిజన మ్యూజియం మాత్రమే ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటుచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజంలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, విలువలు తదితర వారసత్వ సంపదను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయని అన్నారు. అలాగే కుమ్రం భీమ్, రాంజీ గోండ్ వంటి గిరిజన వీరులు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాభిమానాల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు తదితర చారిత్రక అంశాలను యువతకు తెలియజేయడంలో గిరిజన మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఆసక్తిగా నేర్చుకునే విధంగా గిరిజన మ్యూజియం లను ఇంటరాక్టివ్, డిజిటల్ మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి, ప్రధానమంత్రిని ఆహ్వానించి ఆవిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# నార్వేతో బంధం మరింత బలోపేతం

**ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం**

**ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు**

**నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ,మే18 :** భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

**ముస్లింలకు సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక**



**లక్నో :** ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని అన్నారు. లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించ డాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఇకపోతే కోర్టు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. రోడ్లపై నమాజుతో ప్రజలకు ఇబ్బంది క లిగించవద్దని హెచ్చరించింది.

## శంషాబాద్‌లో తప్పిన విమాన ప్రమాదం

**500 మీటర్ల ఎత్తులో విమానాన్ని ఢీకొన్న పక్షి**

**హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి శంషాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఆ సమయంలో విమానంలో 76 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దాదాపు 500 మీట్లర ఎత్తులో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. పైలట్ అప్రమత్తతతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. దీంతో విమానంలోని ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు మూడు నమోదు అయినట్లు తెలుస్తోంది. బర్డ్ స్ట్రైక్ ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాల్లో పక్షుల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

## నటుడు దర్శన్ ఆత్మహత్య అంటూ వదంతులు

**అలాంటిదేమీ లేదని ఖండించిన జైలు అధికారులు**

**బెంగళూరు :** కన్నడ చలనచిత్ర నటుడు, ఓ హత్యకేసులో నిందితుడైన దర్శన్ తూగుదీప బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వదంతులు రావడం సోమవారంనాడు తీవ్ర సంచలనమైంది. దీంతో జైలు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉద్రిక్తత తలెత్తింది. నిజానిజాలను నిర్ధారించేందుకు జైలు సీనియర్ తక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం ఈ వదంతుల్లో ఎలాంటి నిజం లేదని ప్రకటించారు. ఆదివారం రాత్రి నుంచే ఈ వదంతలు వ్యాప్తి చెందాయని, దీంతో జైలు ల్యాండ్ లైన్‌కు వరుస ఫోన్లు వచ్చాయని జైలు సిబ్బంది తెలిపారు. అయితే అలాంటి ఘటనలేవీ చోటుచేసుకోలేదని సీనియర్ జైలు అధికారులు ధ్రువీకరించారు. దీనిపై జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ మాట్లాడుతూ, సినీ నటుడు దర్శన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వచ్చిన వదంతుల్లో ఎంతమాత్రం నిజం లేదని చెప్పారు. వదంతులు నమ్మి ఎవరూ పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు రావద్దని, దర్శన్ క్షేమంగానే ఉన్నారని తెలిపారు. మరోవైపు, మంగళవారంనాడు తన పెళ్లిరోజు అయినందున కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు అనుమతించాల్సిందిగా కోర్టును దర్శన్ కోరారు. దీనిపై కోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. నటి పవిత్రాగౌడ్‌కు అసభ్య సందేశాలు పంపినందుకు రేణుకాస్వామి అనే యువకుడిని హత్య చేశారనే ఆరోపణలను దర్శన్ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో మొత్తం 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

**మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు**

**ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు**

**అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం**

**కోల్‌కతా :** సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

## దేశంలో చమురు కొరత లేదు

**మరోమారు పుకార్లను ఖండించిన కేంద్రం**

**న్యూఢిల్లీ :** భారత్‌లో కేవలం తొమ్మిదిన్నర రోజులకు సరిపడా చమురు నిల్వలు మాత్రమే ఉన్నాయంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. దేశంలో చమురు కొరత అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలపై కేంద్రం స్పష్టతనిచ్చింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కొందరు ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని, వీటిని ప్రజలెవరూ నమ్మవద్దని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ (ఖఎః ఈజీఇబి అర।ఞీ) విభాగం స్పష్టం చేసింది. అమెరికా మినహాయింపు గడువు ముగిసినప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. 'రష్యా చమురుపై అమెరికా ఆంక్షల సమయంలో కూడా భారత్ అక్కడి నుంచి కొనుగోలు చేసింది. ఆంక్షలు సడలించినపుడూ కొనుగోళ్లు చేశాం. ఇకపై కూడా ఆ కొనుగోళు కొనసాగుతాయి. చమురును ఏ దేశం నుంచి కొనాలనే నిర్ణయం పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుంది. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు ఉన్నా, లేకపోయినా మన కొనుగోళ్లు కొనసాగుతాయి' అని పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ స్పష్టం చేశారు. సరఫరా లోటు లేకుండా దేశ అవసరాలను తీర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సుజాత శర్మ తెలిపార. ప్రస్తుతం దేశంలో ముడి చమురు కొరత లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రష్యా చమురుపై అమెరికా తాత్కాలికంగా ఆంక్షలు ఎత్తివేసిన సంగతి తెలిసిందే. ఆ గడువు మే 17వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు సరఫరా ఆగిపోతుందనే ఆందోళనల నేపథ్యంలో కేంద్రం స్పష్టతనిచ్చింది.

## సువేందు అధికారి సహాయకుడు హత్య కేసు

**షూటర్‌ను యూపిలో అరెస్ట్ చేసిన సిబిఐ**

**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చంద్రనాథ్‌ను కాల్చిచంపిన షూటర్ రాజ్‌కుమార్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో సీబీఐ సోమవారంనాడు అరెస్టు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పోలీసుల సాయంతో ఈ అరెస్టు జరిగింది. ఇప్పటికే ట్రాన్సిట్ రిమాండ్ తీసుకున్న సీబీఐ మంగళవారం నాడు కోల్‌కతాలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు అతన్ని హాజరుపరచనుంది. సువేందు అధికారికి అత్యంత విశ్వసనీయుడుగా చంద్రనాథ్ రథ్‌కు పేరుంది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండ్రోజుల తర్వాత మే 6వ తేదీ రాత్రి చంద్రనాథ్ కోల్‌కతా వెళ్తుండగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని దోల్తాలో హత్యకు గురయ్యారు. మోటార్ బైక్‌పై వచ్చిన దుండగులు అత్యంత సమీపం నుంచి ఆయనపై కాల్పులు జరిపారు. ఈ హత్య కేసును తొలుత సిట్ చేపట్టింది. చంద్రనాథ్ కుటుంబానికి న్యాయం చేస్తానని వాగ్దానం చేసిన సీఎం ఆ తర్వాత కేసును సీబీఐకి అప్పగించారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**ట్రక్కును ఢీకొన్న కంటెయినర్..పదిమంది మృతి**

**ముంబై :** మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

## ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర?

**సంచలనం కలిగిస్తున్న తాజా వార్తలు**



**ఇస్లామాబాద్ :** ప్రపంచ దేశాలను అల్లకల్లోలంలోకి నెట్టడం అమెరికా నిత్యం చేస్తూనే ఉంటుంది. తన పట్టును కొనసాగించేందుకు అమెరికా చేయని పనులు లేవు. దానికి సలాం అనకుంటే ఆయా దేశాలను అతలాకుతలం చేస్తుంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఇలా విలవిల్లాడినవే. మనదేశంలోనూ వేలుపెట్టపోయి చేతులు కాల్చుకుందని చెబుతారు. తాజాగా పాక్‌లోనూ ఇలాంటి చర్యలకు దిగినట్లు తాజా వార్తలు రుజువు చేస్తున్నారు. పాక్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందని వెల్లడించే రహస్య దౌత్య సమాచారం తాజాగా లీక్ అయ్యింది. దీనికి సంబంధించిన అసలు పత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ పత్రిక డ్రాప్ సైట్ ప్రచురించింది. ఇందులో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022, ఏప్రిల్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అంతకు ముందు అమెరికాలోని పాకిస్థాన్ రాయబారి అసద్ మజీద్ ఖాన్‌తో అమెరికా హోంశాఖలోని దక్షిణ- మధ్య ఆసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి డోనాల్డ్ లూ సమావేశమయ్యారు. అందులో వారు ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించి జైల్లో పెట్టాలని.. అప్పుడే అమెరికా-పాక్ బంధం మరింత బలపడుతుందని చర్చించుకొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి వైదొలగడంతో షెహబాజ్ షరీఫ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో ఇమ్రాన్‌ఖాన్ తటస్థ వైఖరి కారణంగానే ఆయన్ను ప్రధాని పదవి నుంచి తప్పించాలని అమెరికా నిర్ణయించినట్లు పాకిస్థాన్‌లో లీకైన దౌత్య సమాచారం వెల్లడించింది. పాక్ రాయబారి, అమెరికా

ప్రభుత్వాధికారుల మధ్య భేటీకి ముందు.. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. తనను పదవి నుంచి తొలగించడానికి స్థానిక పార్టీలు, అధికారులతో కలిసి అమెరికా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాగా ఆయన వ్యాఖ్యలను పాక్ ప్రభుత్వం, అమెరికా ఖండించాయి. అనంతరం తోషాఖానా కేసులో ఆయనకు జైలు శిక్ష పడింది. నాటినుంచి ఇమ్రాన్ జైల్లోనే ఉన్నారు. ఇటీవల ఆయనపై హత్యాయత్నం కూడా జరిగిందని వార్తలు వచ్చాయి. మొత్తంగా అమెరికా తీరుతో ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు..

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# నల్లగొండ బిఆర్ఎస్ 'మహాసంగ్రామం'




## రైతు వ్యతిరేక విధానాలపై ముక్తకంఠంతో గళమెత్తిన నేతలు

**ప్రజా దీవెన, నల్లగొండ:** నల్లగొండ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రైతు మహాధర్నా కేవలం ఒక నిరసనలా కాకుండా, బీఆర్ఎస్ (దీ=ా) రాబోయే కాలంలో పవర్‌లోకి రావడానికి గల స్పష్టమైన పొలిటికల్ అజెండాను చాటిచెప్పిందని చెప్ప వచ్చు. ఈ ధర్నాలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎం పీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, గాదరి కిషోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఒంటెద్దు నర్సింహా రెడ్డి సహా వేలాది మంది రైతులు, గులాబీ సైనికులు కదంతొక్కారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా భవిష్యత్ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు కేసీఆర్ సీఎం ఉన్నప్పుడు పంట చేతికి రావడానికి మూడు నెలల ముందే రివ్యూలు చేసి, కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనిపించారు. కానీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటలు రివ్యూలు చేస్తున్నారట, ఆరివ్యూలు రైతుల కోసం కాకుండా కేవలం రియల్ ఎస్టేట్ లాభాల కోసం, మూసి సుందరీకరణ వెనుక ఉన్న వ్యాపారాల కోసం మాత్రమేనని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ పక్కన కూర్చుని రేవంత్ రెడ్డి రైతుల గురించి అడగలేదని,



కేవలం తన రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే అడిగారని ఆరోపించారు. బండి సంజయ్ కొడుకు కేసులో బాధితురాలైన అమ్మాయిపైనే రిటర్న్ కేసు పెట్టించిన ఘోరమైన చరిత్ర ఈ ప్రభుత్వానిదని, కేసీఆర్, కేటీఆర్ రంగంలోకి దిగితేనే 9 రోజుల తర్వాత అరెస్ట్ జరిగిందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి డ్రామాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇలాంటి దుర్మార్గులను రక్షిస్తూ, రాష్ట్రాన్ని దోచుకుని పారిపోవడమే రేవంత్ లక్ష్యమని, అందుకే ప్రజలు మళ్ళీ కేసీఆర్‌ను సీఎం చేసుకోవడం ఖాయం, ఇది కాలం రాసిన రాతని ఆర్ఎస్పీ స్పష్టం చేశారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ తన మార్క్ స్పీచ్‌తో కాంగ్రెస్ మంత్రులపై, ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

"కేసీఆర్ రాకముందు తెలంగాణ లో రైతుల కష్టాలు, ఫ్లోరైడ్ భూతం ఎలా ఉండేవో సరిగ్గా 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ తెచ్చిన శాపంతో మళ్ళీ అదే దుస్థితి వచ్చిందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నల్లగొండ పై ప్రత్యేక దృష్టి పెట్టి, 2013లో కేవలం 3 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న ధాన్యపు దిగుబడిని 2023 నాటికి 40 లక్షల మెట్రిక్ టన్నులకు కేసీఆర్ పెంచారని, కరోనా కష్టకాలంలోనూ కల్లాల వద్దకే వచ్చి కొనుగోలు చేసిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడుతూ గుర్తు చేశారు.

### మిల్లర్లతో మంత్రుల కుమ్మక్కు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై జగదీష్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అస్సలు సోయి లేదని, హెలికాప్టర్లు లేనిదే ఆయన కాలు కదపరని, ధాన్యం కొనుగోళ్లపై కనీసం రివ్యూ చేసే తీరిక కూడా లేదశీటూ ఎద్దేవా చేశారు. మిల్లింగ్ మాఫియాతో జిల్లా మంత్రులు కుమ్మక్కై కమిషన్లు దండుకుంటున్నారని, అందుకే క్వింటాకు 10 కిలోల తరుగు తీస్తూ రైతుల రక్తాన్ని తాగుతున్నా మంత్రులు మౌనంగా ఉన్నారని ఆరోపించారు. వడ్లలో తరుగు తీస్తే రైతులు చెప్పుల తో కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు రోజుకు 500 కిలోమీటర్లు కార్లలో తిరుగుతూ, రోజుకు మూడు రివ్యూలు చేస్తూ రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నామని, ఇప్పుడు ఒక్క మంత్రి కూడా క్షేత్రస్థాయిలో కనపడటం లేదని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసలైన కాంగ్రెస్ కాదని, ఇది మోదీ చంద్రబాబులకు పుట్టిన హైబ్రిడ్ కాంగ్రెస్ అని జగదీష్ రెడ్డి అభివర్ణించారు. కాంగ్రెస్‌లోని లీడర్లు సైతం ఈ పాలన నచ్చక బీఆర్ఎస్ తో కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నారని భవిష్యత్ రాజకీయ బాంబు పేల్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెంటనే దోపిడీని ఆపి, తడిసిన ధాన్యంతో సహా ప్రతీ గింజనూ భేషరతుగా కొనాలని డిమాండ్ చేస్తూ రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికశీ సత్తయ్య గౌడ్, నిరంజన్ వలీ, మందడి సైదిరెడ్డి, రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, తండు సైదులు గౌడ్, మాలే శరణ్య రెడ్డి, కరీం పాషా, కంచర్ల కృష్ణారెడ్డి, జమాల్ ఖాద్రి, సింగం రామ్మోహన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# తాళ్లూరి నిర్మల మరణం తీరని లోటు

**ప్రభుత్వ విప్ వీరేశం, ఎమ్మెల్యే సామేలు, నేతి విద్యాసాగర్ సహా ప్రముఖుల నివాళి.**



**శాలిగౌరారం, :** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి సతీమణి తాళ్లూరి నిర్మల శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూసిన విషయం పాఠకులకు విధితమే. ఆదివారం స్వగ్రామమైన మాదారంలో జరిగిన అంత్యక్రియలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, దైద రవీందర్, నూక కిరణ్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ పాదూరి శంకర్ రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, ఆర్డీవో అశోక్ రెడ్డి, హాజరై తాళ్లూరి నిర్మల భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ మురళిని, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం జరిగిన తాళ్లూరి నిర్మల అంత్యక్రియలు జన సంద్రోహం మధ్య ముగిశాయి. సర్పంచ్ తోటకూరి పరశురాములు, నాయకులు మాజీ జెడ్పిటిసి నోముల వెంకన్న యాదవ్, నోముల జనార్దన్, బండపల్లి కొమరయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నరసింహ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి, చామల జైపాల్ రెడ్డి, చాడ సురేష్ రెడ్డి, షేక్ ఇంతియాజ్, నోముల రవికుమార్, నూక సత్తయ్య యాదవ్, ఎర్ర యాదగిరి, దండ అశోక్ రెడ్డి, బొల్లికొండ గణేష్, వేముల గోపీనాథ్‌తో బి ఆర్ ఎస్ నాయకులు మామిడి సర్వయ్య, అయితగోని వెంకన్న గౌడ్, కట్టా వెంకట రెడ్డి, పాటు మండలంలోని సర్పంచులు, వార్డు మెంబర్లు, డైరెక్టర్లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# యోగ తోనే ఆరోగ్యమైన జీవనం




**శాలిగౌరారం :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం శాలిగౌరారం మండల కేంద్రంలో యోగా, 2ఖ రన్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శాలిగౌరారం ఎంపీడీవో జాల రజిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో మందుల సైదులు, టీజీఎంఎస్ వల్లాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, జడ్పీహెచ్ఎస్ శాలిగౌరారం హెచ్ ఎం కె. మల్లయ్య, ఏపీఎం శంకరయ్య, హెడ్ కానిస్టేబుల్ నజీర్, పీడీ పి. మల్లేష్, యోగా ట్రైనర్ జె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రజిత మాట్లాడుతూ యువత శారీరక, మానసిక దృఢత్వానికి యోగా, క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వం యూత్ వీక్ ద్వారా యువతలో నైపుణ్యం, ఆరోగ్య స్పృహ పెంచేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఐకేపీ ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదాలు సమయంలో మనల్ని మనం రక్షించుకుంటూనే ఎదుటివారిని కాపాడాలి

## నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కీలక వ్యాఖ్య






**ప్రజా దీవెన, చిట్యాల:** ప్రమాదాలు సంభవించినప్పుడు మనల్ని మనం రక్షించుకుంటూనే ఎదుటివారిని కాపాడాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ అన్నారు. పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర ప్రతిస్పందన, సంసిద్ధత, వ్యవస్థలను బలోపేతం చేసే విషయమై జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల ఆదేశాల మేరకు సోమవారం నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధి లోని వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీ (సైమ్ ల్యాబ్స్) లోని ర్వ హించిన "మాక్ డ్రిల్" నమూనా విన్యాసానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగాల ప్రతిస్పందన, సంసిద్ధత పై వివిధ జిల్లాలలో సంసిద్ధత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లా పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన, సంసిద్ధతకు ఎంపిక కాగా, ఈ నమూనా కార్యక్రమాన్ని పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాస్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీ లో నిర్వహించడం జరిగింది. నమూనా విన్యాసాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు సంబంధిత కంపెనీ తక్షణమే స్పందించాలని, ఫైర్, వాటర్, వైద్య ఆరోగ్య శాఖల బృందాలు నిర్దేశించిన సమయం లో అప్రమత్తం కావాలన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ వారిని వారు కాపాడుకుంటూనే, తోటి వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల సమయంలో అత్యవసర ప్రతిస్పందన తో పాటు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండడం, తద్వారా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు నమూనా విన్యాసాలు ఉపయోగపడతాయన్నారు. దీని ద్వారా పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు ఉద్యోగులను ఏ విధంగా సంరక్షించుకోవాలో తెలుస్తుందని చెప్పారు. ఇలాంటి విన్యాసాల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు చనిపోయే వారి సంఖ్యను పూర్తిగా తగ్గించడంతోపాటు, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య చికిత్సలను అందించవచ్చని, తద్వారా సంఘటన సంభవించినప్పుడు ఎంత వరకు సిద్ధంగా ఉన్నామనే విషయం అర్థం అవుతుందన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ వేణు గోపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు హైదరాబాద్ నుండి కార్యక్రమాన్ని ఆన్ లైన్ లో పరిశీలించారు.

### ప్రతిఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యం పై దృష్టిసారించాలి

ప్రతి ఒక్కరూ శారీరక మానసిక ఆరోగ్యం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రం లోని డాక్టర్స్ కాలనీలో ఉన్నవిద్యా గ్రామర్ స్కూల్లో నిర్వహించిన యోగ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నారు . ఇందులో భాగంగా ఈనెల 18 నుండి 23 వరకు యువజన వారోత్సవం నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా సోమవారం" ఫిట్ డయాక్టివ్ తెలంగాణ"లో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చెప్పారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, ఈ వారం రోజులపాటు ఫిట్ తెలంగాణ ఫిజికల్ లీటరసిపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. మనుషులు ప్రతిరోజు వివిధ పనుల నిర్వహించడం వల్ల శరీరం అలసటకు గురవుతుందని, అందువల్ల ఆరోగ్యకరమైన భోజనంతోపాటు, వ్యాయామం ,యోగ వంటివి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫిట్నెస్ పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని, యోగ శారీరక వ్యాయామం ఇందుకు పనికొస్తాయని వివరించారు. యోగా జీవితంలో ఒక భాగం కావాలని, ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ అనుసరిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చున్నారు. ఈ వారం రోజుల పాటు ఫిట్ నెస్ తో పాటు, పర్యాటకానికి సంబంధించిన కార్యక్రమాలను సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జెడ్పి సీ ఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా క్రీడలు,యువజన సర్వీసుల శాఖ అధికారి అక్బర్ అలీ, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన 2కే మారథన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించి రన్ లో పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా తుమ్మల పెన్ పహాడ్‌లో ఘోరం

## ఆస్తి కోసం అక్కను చంపిన తమ్ముడు

**ప్రజా దీవెన, సూర్యాపేట:** సూర్యా పేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలో సరిహద్దు నిఘా వ్యవ స్థలు, ప్రిడిక్టివ్ క్రైమ్ అలర్టు ఉన్న ప్పటికీ మనుషుల్లోని స్వార్థాన్ని, క్రూరత్వాన్ని సాంకేతికత మార్చలేకపోతోంది. ఆత్మకూరు ఎస్ మండల పరిధిలోని తుమ్మల పెన్ పహాడ్ గ్రామంలో సోమవారం తెల్లవారు జామున ఒక దారుణ హత్య కలకలం సృష్టించింది. ఆస్తి కోసం కన్న అక్కనే కత్తితో నరికి చంపాడు ఓ కిరాతక తమ్ముడు. ఈ ఘోర దుర్ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.మృతురాలు సురు గి అంజమ్మ భర్త చనిపోవడంతో, పిల్లలు కూడా లేకపోవడంతో తన స్వగ్రామమైన తుమ్మల పెన్ పహాడ్‌కు వచ్చేసింది. అక్కడ తన చిన్న చెల్లెలి దగ్గరే ఉంటూ వస్తోంది. కష్ట కాలంలో చెల్లెలు తన బాగోగులు, మంచి చెడులు చూసుకుంటుండ డంతో అంజమ్మ భావోద్వేగానికి లోనై, తన పేరిట ఉన్న 2 ఎకరాల విలువైన భూమిని చెల్లెలికే ఇచ్చే స్తానని ప్రకటించింది. అయితే అక్కతీసుకున్న ఈ నిర్ణ యం తమ్ముడికి అస్సలు నచ్చలేదు. “నాకు ఇవ్వకుండా చెల్లెలికి ఎలా ఇస్తావ్?” అంటూ గత కొన్ని రోజులుగా అక్కతో తరచుగా గొడవ పడుతున్నాడు. చివరికి అక్క బ తికుంటే కదా భూమి చెల్లెలికి వెళ్లేది అదే తనే లేకపోతే ఆటోమేటి క్‌గా ఆస్తి నాకే వస్తుందని అనే ఒక క్రూరమైన ఐడియా అతని మైండ్ లోకి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం సరిగ్గా 6:45 గంటల సమయంలో అంజమ్మ రోజువారీగా కరువు పని కి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. అప్పటికే పదునైన కత్తి తో కాపుగాచిన తమ్ముడు ఆమె వెనుక నుంచి ఒక్కసారిగా దాడి చేశాడు. విచక్షణా రహితంగా పలు మార్లు కత్తితో పొడవడంతో అంజమ్మ అక్కడికక్కడే రక్తపు మడుగు లో కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు విడిచింది.

దీంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్స్ సా యంతో ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితుడి కోసం వెతుకులాట ప్రారంభమైంది. ఈ మేరకు కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నామని పోలీసులు తెలిపారు. కా గా టెక్నాలజీ ఎంత పెరిగినా భూ మి, పైసల కోసం కన్నవాళ్లను చం పుకునే నైజం మాత్రం మారడం లే దు అనడానికి ఈ ఘటన నిదర్శ నంగా నిలుస్తుందని చర్చ జరుగు తోంది.





### తుమ్మల పెన్ పహాడ్ లో జిల్లా ఎస్పి నరసింహ

భూ సంబంధిత తగాదాలు ఉంటే చట్ట పరిధిలో పరిష్కరించుకోవా లి చట్టాన్ని ఉల్లంఘించి భౌతిక దా డులు హత్యలు చేస్తే జైలు శిక్షలు తప్పవని సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ స్పష్టం చేశారు. ఆత్మ కూ రు పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మల పెనపహాడ్ గ్రామంలో భూతగాదా ల నేపథ్యంలో జరిగిన మహిళ హ త్య ఘటన స్థలాన్ని ఎస్పీ పరిశీలిం చి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఘటన జరిగిన ప్రదేశంలో క్లూ స్ టీం సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్ సి బ్బంది ఆధారాలు సేకరించాయి. నేరానికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేసును వేగంగా దర్యాప్తు చేసి కోర్టుకు పంపించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ గ్రామానికి చెందిన సురిగి సైదులు సొంత అక్క అంజమ్మకు ఇ ద్దరికీ భూవివాదం నెలకొని ఉంది, దీనికి సంబంధించి గతంలో ఆత్మ కూరు పోలీస్ స్టేషన్ లో కేసు న మోదు చేయడం జరిగింది, ఇరు వ ర్గాలను కూడా బైండోవర్ చేసి హె చ్చరించడం జరిగిందని తెలిపారు. అక్క ఉంటే భూమి నాకు దొరకద ని అక్కను తప్పిస్తే త్వరగా భూమి తన సొంతం చేసుకోవచ్చని భావిం చిన నిందితుడు సైదులు సోమవా రం రోజు ఉదయం కరువు పని ని మిత్తం వెళుతున్న అంజమ్మ పై వి చక్షణ రహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూభూ సంబంధిత తగాదాలు ఉంటే కోర్టు ల సమక్షంలో, పెద్దమనుషుల స మక్షంలో చట్టపరంగా పరిష్కరిం చుకోవాలని చట్టాన్ని ఉ ల్లంఘించి భౌతిక దాడులు చేసిన హత్యలు చేసిన జైలుకు వెళ్లడం తప్పదన్నా రు. గతంలో గరిడేపల్లి మండలం లో పొనుగోడు గ్రామంలో భూతగా దాలకు సంబంధించిన జరిగిన హ త్య కేసులో నలుగురు నేరస్థులకు యావజ్జీవ కారాగార శిక్ష పడిందని గుర్తు చేశారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవా లని కోరారు. నేరానికి పాల్పడ్డ సైదులు పై ఆత్మ కూరు పోలీస్ స్టేషన్ నందు హత్య కేసు నమోదు చేయడం జరిగింద ని, త్వరితగతిన కేసు దర్యాప్తు చే సి నేరస్తులను శిక్ష పడేలా చేస్తామ ని బాధ్యత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తుం దన్నారు. ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖ ర్, క్లూస్ టీం ఇన్స్పెక్టర్ నవీన్, ఎ స్సైలు మహేష్, ఐలయ్య, గోపికృ ష్ణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ధాన్యం కొనుగోలులో ..నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం..

### బిజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి..



కనగల్ :మండలంలోని రేగట్టే,బుడుమర్లపల్లి, లచుగూడెం,చెట్ల చెన్నారం, గ్రామాలలోని ఐకెపి సెంటర్లను సందర్శించిన భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి సందర్శించారు ఐకెపి సెంటర్లు ఓపెన్ చేసి నెల దాటుతున్న గాని ఇప్పటి వరకు కూడా సరైన మార్గంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్ల నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం అడ్డుకోలేకపోతున్నాది అందుకే ఇంకా మార్కెట్ యార్డుల లో ధాన్యం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయినాయి అన్నారు ఆరుగాళ్లు కష్టం చేసిన రైతు పంటను ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడం చాలా బాధాకరమైనదని అన్నారు అకాల వర్షాలు వస్తే రైతుల పరిస్థితి కోసిన పంట ఆగమయ్యే పరిస్థితిలో ఉన్నది కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం పేరుకుపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి సరైన సమయంలో రైతులకు ఖాతాలో డబ్బులు జమ చేయాలని ఆయన కోరారు కేంద్ర ప్రభుత్వం రైతు బాగుపడుతేనె దేశం బాగుపడతాది ఈ దేశానికి ఆర్థిక మూలం రైతే అని గుర్తించి రైతు కు ఎక్కడ ఇబ్బంది కాకుండా కేంద్ర ప్రభుత్వం అనేక విధాలుగా అనేక రకాలుగా రైతును ఇప్పటివరకు ఆదుకుంటూ పోతూనే ఉన్నది కానీ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు ఇప్పటివరకు కూడా చేసింది ఏమీ లేదు రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పిదాలు మొత్తం కేంద్ర ప్రభుత్వం పై నెట్టుతూ కాలం గడిపేసింది తప్ప రైతుకి ఇప్పటివరకు చేసింది ఏమీ లేదు ఇప్పటికైనా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరే డిమాండ్ ఏమనగా అకాల వర్షాలు వచ్చే ప్రమాదం ఉన్నది కావున దీనిని గుర్తించి వెంబటే ఆయా మార్కెట్లలో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంబటే కొనుగోలు చేయాలని కోరుతున్నాం . మిల్లర్లో దోపిడీ అరికట్టాలని దళారుల వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రైతుల పట్ల ఇంత నిర్లక్ష్యం చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇప్పటికీ ఏ రైతు కూడా రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో కాకుండా గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోవు రోజులలో రైతులకు చేసే పాపము మీకు శాపముగా తగిలి కాలగర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి పోతాదని వ్యక్తం చేశారు కనగల్లు మండల అధ్యక్షులు పరసనబోయిన బిక్షం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెండి పాపిరెడ్డి ,ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరందాసు కనకయ్య, అసెంబ్లీ కన్వీనర్ పోలోజు బిక్షమాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పులకరం బిక్షం ,మండల ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకన్న ,పంతంగి సైదులు, పులకరం దుర్గాప్రసాద్ , మధు ,వెంకట్, రెడ్డి శ్రీనివాస్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# దున్నేవానికే భూమి నినాదం ఇంకా సజీవం

### ఇటుకులపహాడ్‌లో నల్ల సోమయ్య వర్ధంతి సభలో విమలక్క..



శాలిగౌరారం మే 18 “వందేళ్ల కమ్యూనిస్ట్ ఉద్యమం లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టింది. ఒక్క తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే పది లక్షల ఎకరాలు పంచాం. ఆ స్ఫూర్తిని కొనసాగించాలి” అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు కామ్రేడ్ విమలక్క పిలుపునిచ్చారు. సీపీఐ (ఎం-ఎల్) జనశక్తి సీనియర్ నాయకుడు, అమరుడు కామ్రేడ్ నల్ల సోమయ్య 30వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్‌లో అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. సభకు ముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరుడు నల్ల సోమయ్య స్మారక స్తూపం వద్ద విమలక్క అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం “వీరుల సన్నిధి సూరుల పెన్నిధి” అంటూ ఆమె ఆలపించిన విప్లవ గీతం సభికుల్లో నూతనోత్తేజం నింపింది. ్రాణాఖ (విజృంభణ) పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరుడు నల్ల జగదీశ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు అందించాలి

### టీయూడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్



**ప్రజా దీవెన, హైదరాబాద్:** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు అందించాలని, సొసైటీల లో సభ్యత్వం తీసుకోనివారికి కూడా ప్రభుత్వం నేరుగా దరఖా స్తులు స్వీకరించి అందరికీ అవకా శం కల్పించాలని తెలంగాణ యూ నియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం తరపున రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లే టి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిప త్రం అందజేశారు. టీయూడబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కా ని మారుతి సాగర్ నేతృత్వంలో మంత్రిని కలిసి యూనియన్ నాయకులు చర్చించారు. గత 20 ఏళ్లకు పైగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులు సొంత ఇంటి కల సాకారం కోసం ఎదురుచూస్తున్నారని, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రస్తుత ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్న ప్రస్తుత సందర్భాన్ని తమ యూనియన్ ఆహ్వానిస్తుందన్నారు. అయితే సొసైటీలలో సభ్యత్వం తీసుకోకుండా ఉన్న అర్హులైన జర్నలిస్టులకు సైతం నేరుగా ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరించి అందరికీ న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలాల పరిశీలనతో పాటు దరఖాస్తులను పరిశీలించడానికి వేసిన హౌసింగ్ కో ఆర్డినేషన్ కమిటీలో జర్నలిస్టు సంఘాలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఒక సంఘానికి చెందిన వ్యక్తులే పాల్గొంటే పారదర్శకత లోపించే ప్రమాదం ఉంటుంది కాబట్టి ప్రధాన జర్నలిస్టు సంఘాలకు చెందిన సభ్యులను ఈ కమిటీలో నియమించాలని వారు మంత్రిని కోరగా ఆయన దానికి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో టి యు డబ్ల్యు జె రాష్ట్ర కోశాధికారి పి.యోగానందం, ఐజేయూ నాయకులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ జిల్లా ఇంచా ర్జ్ నవీన్ కుమార్ యారా, ప్రధాన కార్యదర్శి సోమేష్, కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

# ‘సైమ’ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలి గా గోలి నవ్య రెడ్డి



ప్రజా దీవెన, హైదరాబాద్: సౌత్ ఇండియా మీడియా అసోసియే షన్ (సైమ) అంతర్జాతీయ ఎన్ఆ ర్ఐ సెల్ అధ్యక్షురాలిగా అట్లాం టాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయురాలు, తెలంగాణలోని నల్లగొండ జిల్లా వాస్తవ్యులు గోలి నవ్య రెడ్డి నియమితులయ్యారు. అమెరికాలోని అట్లాంటా నగరంలో ఆదివారం ఘనంగా జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ‘సైమ’ ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి ఆమెకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి మాట్లాడుతూ ‘సైమ’ కార్యకలాపాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎన్ఆర్ఐ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నవ్య రెడ్డి నేతృత్వంలో ఈ విభా గం అంతర్జాతీయ స్థాయిలో బలో పేతం అవుతుందని, ఆమె తన వృ త్తిపరమైన అనుభవంతో బాధ్య తలను సమర్థంగా నిర్వర్తించగల రని ఆశాభావం వ్యక్తం చేశారు.

తమపై నమ్మకంతో ఈ కీలక బా ధ్యతలను అప్పగించినందుకు గో లి నవ్య రెడ్డి ‘సైమ’ యాజమాన్యా నికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపం చవ్యాప్తంగా ఉన్న సౌత్ ఇండియ న్ మీడియా ప్రతినిధులను,ప్రవాస భారతీయులను ఒకే తాటిపైకి తె స్తూ అసోసియేషన్ ఆశయాల సాధనకు శరవేగంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమంలో అమెరికాలో ని పలువురు ప్రవాస భారతీయులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొని నవ్య రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిన్న పత్రికల జాబితాను వెంటనే జిల్లాలకు పంపాలి



**ప్రజా దీవెన, హైదరాబాద్:** భారీ, మధ్య తరహా పత్రికల జాబి తా మాత్రమే జిల్లా పౌర సంబంధాల అధికారులకు పంపడం వల్ల జిల్లాల్లో గందరగోళ పరిస్థితి నెలకొందని,చిన్న పత్రికల జాబితాను కూడా వెంటనే జిల్లాలకు పంపాలని కోరుతూ సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి గారిని కలిసి వినతిపత్రం అందచేసిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం నాయకులు. వెంటనే అధికారులకు చెప్పి జాబితా పంపిస్తామని హామీ ఇచ్చిన కమిషనర్. కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, కోశాధికారి యోగానంద్, ఐ జె యు నాయకులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, ప్రధాన కార్యదర్శి సోమేష్, కోశాధికారి బాపూరావు తదితరులు ఉన్నారు.

# ప్లేఆఫ్స్‌కు సన్‌రైజర్స్

## 5 వికెట్ల తేడాతో గెలిచిన హైదరాబాద్

## రాణించిన ఇషాన్, క్లాసెన్, కమిన్స్



చెన్నై: విజిల్స్ మోత మోగుతూ.. పసుపు సముద్రాన్ని తలపించిన చెపాక్ స్టేడియంలో ఆతిథ్య చెన్నై సూపర్ కింగ్స్‌కు చెక్ పెట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. బంతితో కెప్టెన్ కమిన్స్ (3/28), బ్యాటుతో ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) చెలరేగడంతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో రైజర్స్ 5 వికెట్ల తేడాతో సీఎస్కేను ఓడించింది. 8 విజయాలు 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్తు సొంతం చేసుకున్న ఆరెంజ్ ఆర్మీ..తనతో పాటు గుజరాత్ టైటాన్స్ బెర్తు కూడా ఖాయం చేసింది. ఏడో ఓటమితో చెన్నై దాదాపు ఎలిమినేట్ అయింది.

సీఎస్కే ఇచ్చిన 181 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47) కూడా రాణించాడు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. కమిన్స్ మూడు, సాకిబ్ హుస్సేన్ (2/34) రెండు వికెట్లు తీశారు. ఇషాన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు.

### కమిన్స్ దెబ్బ.. ఆదుకున్న బ్రెవిస్

సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ అద్భుతమైన పేస్, లెంగ్త్‌తో కీలక సమయాల్లో వికెట్లు తీసినా.. బ్యాటర్ల సమష్టి కృషితో సీఎస్కే మంచి స్కోరే చేసింది. ఓపెనర్ సంజూ శాంసన్ (27) చెన్నైకి మెరుపు లాంటి ఆరంభాన్ని ఇచ్చాడు. నితీశ్‌రెడ్డి వేసిన తొలి ఓవర్లోనే సిక్స్, రెండు ఫోర్లు, ఆపై ప్రఫుల్ హింగే బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాడు. అయితే, మూడో ఓవర్లోనే రంగంలోకి దిగిన కమిన్స్.. బుల్లెట్ లాంటి బంతితో శాంసన్‌ను ఔట్ చేసి రైజర్స్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. యంగ్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ (13) కమిన్స్ బౌలింగ్‌లోనే వరుసగా రెండు సిక్సర్లు బాదినప్పటికీ, సాకిబ్ వేసిన స్లో బాల్‌కు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కెప్టెన్ గైక్వాడ్ (21 బంతుల్లో 15) ఒక్క బౌండరీ కొట్టకపోయినా.. కార్తీక్ శర్మ ధాటిగా బ్యాటింగ్ చేశాడు.

హింగే బౌలింగ్‌లో 4,6, కొట్టిన అతను గైక్వాడ్‌తో మూడో వికెట్‌కు 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. కానీ, పదో ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన కమిన్స్ ఈ కుర్రాడిని పెవిలియన్‌కు పంపాడు. ఆ వెంటనే గైక్వాడ్‌ను కూడా ఓ పవర్‌ఫుల్ బౌన్సర్‌తో ఔట్ చేయడంతో 100/4తో చెన్నై ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో శివమ్ దూబే (26)తో కలిసి బ్రెవిస్ జట్టును ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నాడు. నితీశ్‌ను టార్గెట్ చేసి 4, 4, 6 కొట్టిన అతను కమిన్స్ బౌలింగ్‌లో 6,4తో అలరించాడు. ఈషాన్ వేసిన 18వ ఓవర్లో మరో సిక్స్ కొట్టిన అతను వెంటనే క్లీన్‌బౌల్డ్ అవ్వడంతో ఐదో వికెట్‌కు 59 పరుగులు భాగస్వామ్యం ముగిసింది. చివరి రెండు ఓవర్లలో దూబే, ప్రశాంత్ వీర్ (11)ను కట్టడి చేసిన రైజర్స్ బౌలర్లు చెన్నై భారీ స్కోరును అడ్డుకున్నారు.

### గెలిపించిన ఇషాన్

లక్ష్య ఛేదనను సన్‌రైజర్స్ నింపాదిగా ఆరంభించినా తర్వాత దూకుడు చూపెట్టింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (6) మూడో ఓవర్లో ముకేశ్ చౌదరికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశపరచగా.. తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (26) తనదైన స్టయిల్లో ఆడలేకపోయాడు. దాంతో వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ బాధ్యత తీసుకున్నాడు. స్పెన్సర్ జాన్సన్ వేసిన నాలుగో ఓవర్లో మూడు ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన అతను అన్షుల్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో పవర్‌ప్లేను 45/1తో ముగించాడు. స్పిన్నర్ నూర్ బౌలింగ్‌లో సిక్స్‌తో వేగం పెంచే ప్రయత్నం చేసిన అభి.. మరో స్పిన్నర్ అకీల్ హుస్సేన్‌కు వికెట్‌కు ఇచ్చుకున్నాడు. దాంతో రైజర్స్ 56/2తో ఇబ్బందుల్లో పడేలా కనిపించింది. అయితే, అప్పటికే క్రీజులో కుదురుకున్న ఇషాన్‌కు తోడైన క్లాసెన్ తనదైన శైలిలో విజృంభించాడు.

స్పిన్నర్లు అకీల్, నూర్‌ను టార్గెట్ చేసి రెండేసి ఫోర్లు, సిక్సర్లతో ఎదురుదాడికి దిగాడు. అటువైపు ఇషాన్ కూడా క్రమం తప్పకుండా బౌండరీలు కొట్టడంతో మ్యాచ్ రైజర్స్ వైపు మొగ్గింది. అర్ధ శతకం ముంగిట నూర్ వేసిన 15వ ఓవర్లో శాంసన్ మెరుపు స్టంపింగ్‌కు క్లాసెన్ పెవిలియన్ చేరడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దాంతో సీఎస్కే మళ్లీ రేసులోకి వచ్చేలా కనిపించింది. కానీ, కిషన్ అస్సలు తగ్గలేదు. 37 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్న అతను.. నితీశ్ రెడ్డి (11) తోడుగా లక్ష్యాన్ని కరిగించాడు. 18 బంతుల్లో రైజర్స్‌కు 28 పరుగులు అవసరమైన దశలో 18 ఓవర్లో నితీశ్‌ను ఔట్ చేసిన ముకేశ్ చెన్నై శిబిరంలో ఆశలు రేపాడు. కానీ, ఆ జట్టుకు ఎలాంటి చాన్స్ ఇవ్వని ఇషాన్ అదే ఓవర్లో 4,6తో రైజర్స్ విజయం ఖాయం చేశాడు. ఆపై కాంబోజ్ బౌలింగ్‌లో ఇషాన్ ఔటైనా సలీల్ (10 నాటౌట్), స్మరన్ (5 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

8 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ చేరడం ఇది ఎనిమిదోసారి

1 ఒక ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ తొలిసారి సీఎస్కేతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 180/ 7 ( బ్రెవిస్ 44, కార్తీక్ శర్మ 32, కమిన్స్ 3/28, సాకిబ్ హుస్సేన్ (2/34);

సన్‌రైజర్స్ : 19 ఓవర్లలో 181/5 (ఇషాన్ 70, క్లాసెన్ 47, ముకేశ్ 2/36)


# ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ ఆశలు సజీవం



ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఢిల్లీ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరింది. 5 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసి 4 బాల్స్ మిగిలి ఉండగానే ఛేజ్ చేసి గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశి 21 బాల్స్‌లో 5 ఫోర్లు, 3 సిక్సులు కొట్టి 46 పరుగులు చేశాడు. కెప్టెన్ రియాన్ పరాగ్ 26 బాల్స్‌లో 3 ఫోర్లు, 5 సిక్సులతో 51 రన్స్ చేశాడు. ధ్రువ్ జురెల్ 40 బాల్స్‌లో 53 రన్స్ సాధించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ లోని మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు తీసి రాజస్థాన్ మ్యాచ్‌ను తిప్పికొట్టాడు. అతను 14.2వ ఓవర్‌లో పరాగ్, 14.3లో డోనవన్ ఫెరీరా, 14.5లో రవి సింగ్ వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్‌లాంటి ప్రదర్శన చేశాడు. లుంగి ఎన్‌గిడి 2 వికెట్లు, మధవ్ తివారి 2 వికెట్లు సాధించారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ఢమాల్ అంది. ఢిల్లీ ఛేజ్‌లో అభిషేక్ పోరెల్ 31 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 51 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 42 బాల్స్‌లో 1 ఫోరు, 3 సిక్సులు కొట్టి 56 పరుగులతో అద్భుత ఆరంభం ఇచ్చారు. కెప్టెన్ ఆక్సర్ పటేల్ 19 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇతరులు కీలక సహకారం అందించారు. జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీసినా ఢిల్లీ స్థిరంగా ఛేజ్ పూర్తి చేసింది. అశుతోష్ శర్మ చివరి ఓవర్లలో సిక్స్‌తో మ్యాచ్‌ని ముగించాడని ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో తెలిపింది. ఆక్సర్ పటేల్ (ఢిల్లీ) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది, కానీ స్టార్క్ లాంటి బౌలర్లు డెత్ ఓవర్లలో ప్రభావం చూపారు. వాతావరణం హాట్ ॰ డ్రైగా కనిపించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ 13 మ్యాచుల్లో 6 విన్నింగ్స్‌తో 12 పాయింట్లు సాధించి 7వ స్థానంలో ఉంది. రన్ రేట్ −0.871. రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో 6వ స్థానంలో ఉంది. ఈ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి 6 గెలిచింది. రాజస్థాన్ బ్యాటింగ్ ఆరంభంలో బాగుంది కానీ మిడిల్ ఓవర్లలో.. స్టార్క్ స్టార్మ్ ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తియ్యడం వల్ల చిక్కుల్లో పడింది. ఢిల్లీ బ్యాటింగ్ డెప్త్, ఫినిషింగ్ సామర్థ్యం గెలుపును తెచ్చిపెట్టాయి. రెండు జట్ల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది. ఇది సీజన్‌లో కీలక మ్యాచ్‌లలో ఒకటి. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ కూడా ఆటను ప్రభావితం చేసిందని ఎన్డీటీవీ స్పోర్ట్స్ రిపోర్ట్ చేసింది.

# రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు

ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్ కు డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖేల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు. రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా..” అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు. ఎడమచేతి స్పిన్ బౌలర్ కావడం వల్ల పరుగులను కూడా కట్టడి చేసేవాడని వివరించారు. రియాన్ పరాగ్ కెప్టెన్సీని కూడా మైఖేల్ వాన్ తప్పుబట్టారు. ఢిల్లీ ఛేజింగ్‌లో 18వ ఓవర్‌లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ డొనోవన్ ఫెరీరాను బౌలింగ్‌కు దించడాన్ని వాన్ విమర్శించారు. “డొనోవన్ ఫెరీరాను బౌలింగ్ చేయించిన వ్యూహాత్మక నిర్ణయాన్ని నేను ప్రశ్నించాల్సిందే. ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని భావించి పార్ట్‌టైమ్ ఆఫ్-స్పిన్నర్‌ను ప్రవేశపెట్టారా? అది గొప్ప నిర్ణయం కాదు, అనవసరం.. అని వాన్ అన్నారు.




# ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: ఆశ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హా మీలను తక్షణమే అమలు చేయా లని సిఐటియు జిల్లా కార్యదర్శి యం.డి సలీమ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఆశా వర్క ర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లగొండ మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాంప్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశ వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు ఇస్తామని, ఇన్సూరెన్స్ సౌకర్యం 50 లక్షల రూపాయలు, మట్టి ఖర్చులకు 50,000 అర్హులైన ఆశ వర్కర్లకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పిస్తామని తదితర అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా నెలనెల సక్రమంగా వేతనాలు కూడా ఇవ్వకుండా ఆశ వర్కర్ల ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయంగా రావలసిన హక్కుల కోసం పోరాడుతుంటే పోలీసుల ద్వారా నిర్బంధాలు ప్రయోగించి ఆశ వర్కర్ల ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో జాబ్ చాట్ లో లేని అనేక రకాల పనులు చేయిస్తూ అదనపు పని భారాలను మోపుతు ఆశ వర్కర్ల అనారోగ్యాలకు కారణం అవుతున్నారని విమర్శించారు. దశల వారి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే కి వినతిపత్రం ఇస్తున్నామని, తమ సమస్యల పరిష్కారం కాకపోతే పోరాటం ఉదృతం చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన కోరారు. సమస్యలు పరిష్కరించనీయుడల జులైలో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉ పాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ గంజి రాజేష్ నల్గొండ పట్టణ తిప్పర్తి కనగల్లు మండలాల ఆశా వర్కర్లు కే స్వర్ణ, డి నిర్మల, ఎడవల్లి ప్రేమలత, సిహెచ్ వీరభద్ర మ్మ , గాదరి పూలమ్మ, హేమలత, సిహెచ్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంఘాలన్ని ఐక్య పోరాటా లు నిర్వహించాలి

### బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు



**ప్రజా దీవెన, హైదరాబాద్:** రానున్న ఎంపిటిసి ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ మరియు జనగణలో కులగణన సాధించేంతవరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ ఉద్యమ సంస్థలు ఐక్య పోరాటాలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు.

సోమవారం నాడు ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ.... బీసీ ఉద్యమాలను మరింత ఉధృతంగా నిర్వహించలేకపోతే బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్ తో పాటు కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించే పరిస్థితి కనిపిస్తుందని, అదే జరిగితే బీసీలు మరో 10 సంవత్సరాలు వెనుకబాటు తనానికి గురవుతారని, వేరువేరు దారుల్లో నడుస్తున్న బీ సి ఉ ద్యమాలను బూర్జువా పార్టీలు మాయమాటలు చెప్పి వారిని తమ వెనక తిప్పుకుంటూ బీసీ ఉద్యమాన్ని నీరు గార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారి వలలో పడవద్దని పలు బీసీ సంఘాల నాయకులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో ఒక బీసీ సంఘం నేతను తమలో చేర్చుకొని అతనితో తప్పుడు ప్రకటనలు చేయిస్తున్నారని బిసి రిజర్వేషన్ బిల్లు షెడ్యూల్ 9 లో చేర్చాల్సిన వాళ్లే, సత్యాగ్రహ దీక్షలు చేపట్టడం తప్పుడు ప్రకటనలు చేయడం హాస్యాస్పదమని, అందువల్ల రాష్ట్రంలో వివిధ రూపాల్లో వివిధ సంస్థలకు నాయకత్వం వహిస్తూ బీసీ ఉద్యమాలు నడిపిస్తున్న బీసీ నాయకులంతా ఐక్యమై బీసీ జేఏసీగా ఏర్పడి కాంగ్రెస్ బిజెపిలు రెండు కూడా బీసీలకు న్యాయం చేసే వరకు వారిపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్ సాధించుకోవాలని అలాగే కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ సాధించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు.

# కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తి పాదానికి గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు గుప్పించారు.


# కొరటాల, బాలయ్య కాంబో

## ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్





టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది. దేవర తర్వాత కొరటాల తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో కథ విషయంలో ఆయన చాలా సమయం తీసుకుని కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక నిర్మాణ బాధ్యతలను నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బాలయ్య ఇప్పటికే వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉండగా, కొరటాల శివతో మొదటిసారి జతకట్టడం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్ కలిస్తే ఈ సినిమా మరో భారీ హిట్‌గా నిలుస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



# పెద్దికి సెన్సార్ క్లియరెన్స్

## 3గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం. దీంతో పాటు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్, సెన్సార్ టాక్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, కథలోని తీవ్రత ప్రేక్షకులను మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఎక్కడా కథ నెమ్మదించకుండా స్క్రీన్‌ప్లేను బుచ్చిబాబు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం 1980ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే జీవన విధానం, క్రీడా సంస్కృతి, మనుషుల మధ్య ఉన్న భావోద్వేగాలు, పంతాలు, పట్టింపులను కథలో ప్రధానాంశాలుగా తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని కూడా ప్రత్యేకంగా మార్చుకున్నట్లు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు స్పష్టం చేశాయి. ఈ లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సెన్సార్ బృందం నుంచి కూడా సినిమాకు మంచి స్పందన వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు మేకింగ్, సినిమాలోని ఎమోషనల్ కంటెంట్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని టాక్ వినిపిస్తోంది. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను కదిలించే స్థాయిలో ఉంటాయని కూడా సమాచారం.



# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

## రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత

నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.

# టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

## కారణాలను వెల్లడించిన హీరో యశ్



యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ సినిమాను ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. మొదట సినిమాను మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాతే డిస్ట్రిబ్యూషన్ గురించి మాట్లాడుకుంటాం. ప్రస్తుతం నేను సినిమా విడుదల ప్రణాళికల పనుల్లోనే ఉన్నాను. ఈ పద్ధతి కచ్చితంగా అభిమానులకు నచ్చకపోవచ్చని అన్నారు. మొదట ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయాలని భావించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూన్ 4కు వాయిదా వేశారు. తర్వాత ఈ తేదీకి కూడా రావడం లేదంటూ యశ్ పోస్ట్ పెట్టారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయిందని ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి రిలీజ్ చేయాలనే ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA